క్లుప్తంగా

నగదు రహితంగా సిలిండర్ ఇవ్వాలి

బోట్‌క్లబ్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్లను నగదు రహితంగా వినియోగదారులకు ఇవ్వాలని నగర పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తామని, ప్రస్తుతం వినియోగదారులు నగదు చెల్లిస్తే.. వారి ఖాతాలకు నగదు బదిలీ చేస్తామని నిబంధన తగదన్నారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి సిలిండర్ ఇస్తామనడం సమంజసంగా ఉన్నప్పటికీ, నగదు బదిలీ పద్ధతి బాగోలేదని వ్యాఖ్యానించారు. ఈ నిబంధనలతో సాధారణ, మధ్య తరగతి ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. సమయానికి డబ్బు చెల్లించలేని వారికి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందే అవకాశం ఉండదన్నారు. ప్రభుత్వం దీనిపై నిర్ణయం మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా 'సమితి' వ్యవస్థాపక దినోత్సవం

కాకినాడ రూరల్: ఐక్యరాజ్య సమితి వ్యవస్థాపక దినోత్సవాన్ని స్థానిక అచ్చంపేట జంక్షన్ వద్దనున్న నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కోర్సు కో–ఆర్డినేటర్ డాక్టర్ జోసెఫ్ స్టీఫెన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ కమలకుమారి ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించారు. ప్రపంచ శాంతి స్థాపనలో ఐక్య రాజ్యసమితి కృషిని విద్యార్థులకు వివరించారు.

క్యాంపస్ డ్రైవ్

నన్నయ ఎంఎస్ఎస్ పీజీ సెంటరులో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో కెరియర్ బ్రిడ్జి ఐటీ సర్వీసెస్, ర్యాలీ లైఫ్ స్కిల్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ కళాశాలల నుంచి సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పీజీ సెంటర్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రామరాజు, ప్రిన్సిపాల్ కమలకుమారి, హేమంత్ గంగిరెడ్డి, గణేష్, భారతి అరోరా, సతీష్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయి సన్నిధిలో మహాన్నదానం

కరప: సాయి నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం స్థానిక వల్లపువీధిలోని గంటాలమ్మగుడి ఆవరణలోని షిర్డీ సాయి మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా అర్చకులు ముత్య ప్రసాద్ ఉదయం సుప్రభాత సేవ, కాకడ హారతి తదితర పూజాదికాలు చేశారు. ఈ సందర్భంగా మహాన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కరప, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, సాయి భక్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మద్యం దుకాణాలు తొలగించాలి



నిరసన తెలుపుతున్న మహిళా నాయకులు

కాకినాడ క్రైం: నగరంలోని కచేరీపేటలో ఉన్న ఉపాధ్యాయ సంఘ భవంతి సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణంతో పాటు, గాంధీనగర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన మరో మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ యునైటెడ్ టీచర్స్ ఫ్రంట్(యూటీఎఫ్)కు చెందిన మహిళా ఉపాధ్యాయులు, శ్రామిక మహిళా సంఘ, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. నిత్యం మహిళలు, టీచర్లు ప్రయాణించే కచేరీపేట యూటీఎఫ్ భవంతి వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయడం ఏ మాత్రం సరైన నిర్ణయం కాదని గురువారం రాత్రి తెలిపారు. ఈ మేరకు మద్యం దుకాణాల వద్ద చేపట్టిన నిరసనలో నాయకులు దేవి, నసీఫా, భువనేశ్వరి, అప్సరి, జహరి, నర్ల ఈశ్వరి, సీహెచ్ వేణి, రాణి, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి చేయూత



తండ్రి వెంకటరమణకు సాయాన్ని అందజేస్తున్న సునీల్, సతీష్

కాకినాడ క్రైం: ఓ చిన్నారి వైద్యానికి శ్రీయ వసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ గురువారం విశాఖపట్టణం వెళ్లి ఆర్థికసాయం అందించారు. అడ్డతీగలకు చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి డి.హేమనవిత తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ, ప్రాణాపాయ స్థితిలో విశాఖపట్టణంలో వైద్యం పొందుతోంది. ఆమె తల్లి కొద్ది రోజుల క్రితం ఇదే సమస్యతో కాకినాడలో చికిత్స పొందుతూ మరణించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న సతీష్ శ్రీయవసేన తరపున చిన్నారి వైద్యానికి సాయం అందించాలని సంకల్పించారు. సహాయం చేయలంటూ దాతలకు పిలుపునిచ్చారు. వారి సహకారంతో రూ.70 వేలు వసూలు చేశారు. విశాఖపట్టణంలోని రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్‌కు వెళ్లి ఈ మొత్తాన్ని చిన్నారి తండ్రి వెంకటరమణకు అందించారు. కాకినాడకు చెందిన దాత సునీల్ చేతుల మీదుగా నగదు ఇచ్చారు.

విరబూసిన క్రీడా కుసుమాలు

- జిమ్నాస్టిక్స్‌లో రాణిస్తున్న 'తూర్పు'
- రాష్ట్ర స్థాయి 17 బంగారు, 15 రజత, 14 కాంస్య పతకాలు కైవసం
- అందుబాటులో అంతర్జాతీయ స్థాయి జిమ్నాజియం
- ఆర్టిస్టిక్, రిథమిక్‌లోనూ శిక్షణ
- జాతీయ స్థాయికి పలువురు క్రీడాకారుల ఎంపిక



కాకినాడ డీఎస్ఏలోని జిమ్నాజియం

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ప్రణతి నాయక్, యోగేశ్వర సింగ్, నికిత్ నగ్రోని వీరందరూ అంతర్జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్‌లో రాణిస్తున్న క్రీడాకారులు. వీరంతా వారి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తున్న వారే... వారిని ఆదర్శంగా తీసుకుని కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని జిమ్నాజియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఈ నెల 17 నుంచి 19 వరకు గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి రిథమిక్ జిమ్నాస్టిక్స్ పోటీలలో విశేషంగా రాణించారు. రాష్ట్ర స్థాయిలో 17 బంగారు, 15 రజత, 14 కాంస్య పతకాలు గెలుచుకున్నారు. గుజరాత్‌లో డిసెంబర్ 25 నుంచి జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో పతకం కోసం ఉదయం, సాయంత్రం డీఎస్ఏలోని జిమ్నాజియంలో కఠోర శిక్షణ పొందుతున్న క్రీడాకారులు గురువారం తమ మనోభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు వారి మాటల్లోనే..

కాకినాడ డీఎస్ఏలోని జిమ్నాజియంలో కోచ్ సురేష్ ఆధ్వర్యంలో జిమ్నాస్టిక్స్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ అందిస్తున్నారు. 60 మంది క్రీడాకారులు ప్రతిరోజు శిక్షణకు హాజరవుతున్నారు. వీరికి ఆర్టిస్టిక్‌లో ఫ్లోర్, పామల్ హార్స్, రింగ్స్, టేబుల్ వాల్ట్, హైబార్, ట్రాంపోలిన్, ఏరోబిక్స్, యాక్రోబైటిక్స్‌లో శిక్షణ అందిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి వసతులతో జిమ్నాజియంలో శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ సదుపాయాలు కలిగిన ఈ స్టేడియం రాష్ట్రంలో రెండోది.



ఆర్టిస్టిక్ రింగ్ విభాగంలో సాధన చేస్తున్న క్రీడాకారిణి



టేబుల్ వాల్ట్‌లో సాధన చేస్తున్న క్రీడాకారుడు

రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులు సాధించిన పతకాలిలా..

- అండర్–10 బాలికల విభాగంలో మోక్షశ్రీ రెండు బంగారు, ఎం.పల్లవి రెండు వెండి, మహిజైన్ ఒక బంగారు పతకం అందుకున్నారు.
- అండర్–12 బాలుర విభాగంలో లెహర్ వల్లీ సాయి ప్రసాద్ ఐదు బంగారు, ఒక వెండి, బి.కార్తికేయ ఒక వెండి, ఐదు కాంస్య పతకాలు, బాలికల విభాగంలో సహస్ర రెండు బంగారు, అనియాజైన్ ఒక బంగారు పతకం కైవసం చేసుకున్నారు.
- జూనియర్స్ బాలికల విభాగంలో లక్ష్మీ పద్మలత ఒక బంగారు, ఒక వెండి, ఒక కాంస్య పతకం, ఎన్.వెంకట జోష్టిక ఒక వెండి, జీవిక ఒక కాంస్య పతకం గెలుచుకున్నారు.
- జూనియర్ బాలుర విభాగంలో శివగణేష్ వీరబాబు మూడు బంగారు, మూడు వెండి, సాయి అభిరాం ఒక కాంస్య, ప్రేమ్‌కుమార్ ఒక వెండి పతకం.
- సీనియర్ మహిళల విభాగంలో కావ్యసాయిశ్రీ ఒక కాంస్య, సీనియర్ పురుషుల విభాగంలో చంద్రస్వరూప్ ఒక బంగారు, రెండు వెండి, ఒక కాంస్య పతకం కైవసం చేసుకున్నారు.

తొమ్మిదేళ్లుగా శిక్షణ



నా పేరు వీరబాబు. కాకినాడ డీఎస్ఏలో గత తొమ్మిదేళ్లుగా జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ పొందుతున్నాను. గాంధీనగర్ మున్సిపల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాను. గుంటూరులో జరిగిన పోటీలలో ఆర్టిస్టిక్ విభాగంలో ఆరు బంగారు పతకాలు సాధించాను. జాతీయ స్థాయిలో మెడల్ సాధించడం నా లక్ష్యం. రైల్వే ఉద్యోగం నా కల. కోచ్ సురేష్ వద్ద శిక్షణ పొందుతున్నాను.

ఐఏఎస్ నా కల



నా పేరు డి.సాయి సహస్ర. మా బాబాయి జిమ్నాస్టిక్స్ కోచ్. తనని ఆదర్శంగా తీసుకుని జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ పొందుతున్నాను. గుంటూరులో జరిగిన పోటీలలో రెండు బంగారు పతకాలు సాధించాను. గత ఏడాది కర్నూలులో శిక్షణ పొందాను. ఇప్పుడు కాకినాడలోని డీఎస్ఏలో శిక్షణ పొందుతున్నాను. నాకు ఐఏఎస్ కావాలన్నది నా కోరిక. అందుకు శ్రమిస్తాను కూడా.

కాంస్య పతకం సాధించాను



నా పేరు అఖిల్. నేను తొమ్మిదో తరగతి చదువుతున్నాను. రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో కె. సురేష్ వద్ద చాలా కాలంగా శిక్షణ పొందుతున్నాను. గ్వాలియర్‌లో అక్టోబర్ 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగిన సీబీఎస్ఈ పోటీలలో కాంస్య పతకాన్ని సాధించాను.

ఆరేళ్ల నుంచి చేరవచ్చు



అండర్–10 నుంచి శిక్షణ అందిస్తున్నాం. కాకినాడ డీఎస్ఏలోని జిమ్నాజియంలో అంతర్జాతీయ స్థాయి పరికరాలు ఉన్నాయి. అండర్–10 నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ అందిస్తున్నాను. ఆరేళ్ల వయస్సు నుంచి ఎవరైనా చేరవచ్చు.

– సురేష్, జిమ్నాస్టిక్స్ కోచ్, డీఎస్ఏ

రూ.8 లక్షలతో లైటింగ్



డీఎస్ఏలోని జిమ్నాజియానికి రూ.8 లక్షలతో ఆధునిక లైటింగ్ సౌకర్యం కలిపిస్తున్నాం. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభమవుతాయి. జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు తగ్గట్టుగా లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నాం.

– బి.శ్రీనివాస్ కుమార్, డీఎస్‌డీఓ, కాకినాడ

పోలియో చుక్కలతో చిన్నారులకు రక్ష



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అద్దాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: చిన్నారుల బంగారు భవిష్యత్తుకు రక్షణ కవచంగా పోలియో చుక్కలు నిలుస్తాయని, వైద్యుల సూచనల మేరకు తల్లిదండ్రులు తమ చిన్న పిల్లలకు విధిగా పోలియో చుక్కలు వేయించాలని డాక్టరు అద్దాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ పోలియో నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పోలియో వ్యాధి నివారణ కోసం శాస్త్రవేత్త ఆల్బర్ట్ సబిన్ 1962 అక్టోబర్ 24న పోలియో వ్యాక్సిన్ చుక్కల మందును కనుగొన్నారన్నారు. నిండు నూరేళ్ల ఆరోగ్యకరమైన చిన్నారుల జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడబాల ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రవిశంకర్ పట్నాయక్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు ఆపాలి

- జేసీ, డ్వామా పీడీకి వినతిపత్రాల అందజేత



డ్వామా పీడీకి వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

కాకినాడ సిటీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలని జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ కోరింది. గురువారం కలెక్టరేట్‌లో జేసీ రాహుల్ మీనాను, ఇదే ఆవరణలోని డ్వామా కార్యాలయంలో డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మిని కలిసి సంఘ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వీరు విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల కరప మండలం పెనుగుదురు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాజకీయ వేధింపుల వల్ల అత్మహత్యా యత్నానికి పాల్పడిన నేపథ్యంలో సంఘ ప్రతినిధులు జేసీని, డ్వామా పీడీని కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కడమటి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో తమపై రాజకీయ వేధింపులు పెరిగాయని, వాటిని తక్షణమే అరికట్టాలని కోరారు. మండల పరిధిలో ఫీల్డ్ అసిస్టెంట్లను బదిలీలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలు పరిష్కరిస్తామని జేసీ, పీడీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సలాది శ్రీనివాస్, రాయుడు శివసత్యనారాయణ, గొల్లపల్లి ప్రదీప్‌కుమార్, గుబ్బల సత్యవేణి, సిద్ధాంతపు శివ తదితరులు పాల్గొన్నారు.

పశుగణన సర్వే సమగ్రంగా చేయాలి



సిబ్బందికి పశుగణన మెటీరియల్ అందజేస్తున్న ఏడీ సురేష్‌బాబు

కరప: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పశు గణన సర్వే సమగ్రంగా నిర్వహించి, సకాలంలో నివేదికలు ఇవ్వాలని పశు సంవర్థక శాఖ కరప సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌జే సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా మండలంలోని నడకదురు పశు వైద్యశాలలో గురువారం వెటర్నరీ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పశు గణన ఎలా నిర్వహించాలి, తీసుకోవాల్సిన చర్యలను ఏడీ డాక్టర్ సురేష్‌బాబు అవగాహన కల్పించారు. అనంతరం వెటర్నరీ సిబ్బందికి పశుగణనకు సంబంధించిన మెటీరియల్, స్టిక్కర్స్, ఐడీ కార్డులు అందజేశారు. నడకుదురు, వేళంగి పశు వైద్యాధికారులు డాక్టర్ ఎం.రవికిరణ్, డాక్టర్ కె.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పోలియో వ్యాధిపై అవగాహన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

కాకినాడ సిటీ: నగరంలోని అన్నవరం సత్యవతిదేవీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ పోలియో నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగరాయ మెడికల్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైక్రో బయాలజీ ఎండీ నిర్మల గ్రేస్ పోలియో వ్యాధిపై అవగాహన కల్పించారు. పోలియో వ్యాక్సిన్‌లోని రకాలు, పల్స్ పోలియో ముఖ్యోద్దేశం, వ్యాధి నిర్మూలనలో ప్రపంచం సాధించిన పురోగతిని విశదీకరించారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ సువర్చలా, ఐక్యు ఏసీ కో–ఆర్డినేటర్ వసంతలక్ష్మి, అకడమిక్ కో–ఆర్డినేటర్ లావణ్య, శ్యామల, జి.అనిత జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: స్వామివారి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు పాణింగల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. వానపల్లి ఉదయ భావన్నారాయణాచార్యులు ఆధ్వర్యంలో ఈ కల్యాణం కనుల వైకుంఠంగా జరిపించారు. కన్యాదానం, జీలకర్ర బెల్లం, తలంబ్రాలు వంటి ఘట్టాలు భక్తులను మైమరపించాయి. కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కుళాయిల్లో కలుషిత నీటిని అరికట్టాలి

- ఎమ్మెల్యే పంతం నానాజీ
- మండల పరిషత్ సాధారణ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ. చిత్రంలో ఎంపీపీ వీరీష, జెడ్పీటీసీ రామకృష్ణ, అధికారులు

కాకినాడ రూరల్: గ్రామాలలో పర్యటిస్తే కుళాయిల నుంచి కలుషిత రంగు నీరు వస్తుందని ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ కలుషిత నీటిని నిలువరించేందుకు ఎన్ని రోజుల సమయం పడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రశ్నించారు. కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బందిలి వీరీష అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం జరిగింది. ఎమ్మెల్యే నానాజీ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ(కిట్టు) ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత కొత్తగా వచ్చిన అధికారులను సభలో పరిచయం చేసుకోవాలని ఎంపీడీఓ పి.సతీష్ సూచించడంతో, తహసీల్దార్ కుమారి, మండల పరిషత్ ఏఓ భీమశంకర్, ఈఓ పీఆర్ అండ్‌ఆర్‌డీ శ్రీరామ్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పరిచయం చేసుకున్నారు. అనంతరం శాఖల వారీగా అధికారులు ప్రగతిని నివేదించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మారు తీరావును కుళాయిల్లో స్వచ్ఛమైన నీటిని ఎప్పుడు ఇస్తారని నిలదీశారు. వాటర్ ట్యాంక్‌లు క్లీనింగ్ చేసినా నీరు ఎందుకు రంగు మారి వస్తుందని అరికట్టాలన్నారు. వారం రోజుల్లో కుళాయిల ద్వారా మంచినీటిని అందించేందుకు ఏఈ హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖకు సంబంధించి కొన్ని గ్రామాల రైతులకు ఎరువులు అందడం లేదని ఫిర్యాదులు ఉన్నాయని, వీటిని పరిష్కరించాలని ఏఓ సత్యనారాయణకు ఎమ్మెల్యే సూచించారు. నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు తమ గ్రామంలో అసంపూర్తి స్కూల్ బిల్డింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. డ్రైనేజి శాఖ అధికారులు సక్రమంగా డ్రైనేజీల పూడిక తొలగించకపోవడంతో ఇటీవల వర్షాలకు మారుతీనగర్, అవంతీనగర్ ముంపునకు గురయ్యాయని తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ తెలిపారు. తమ గ్రామానికి పూర్తి అదనపు బాధ్యతలు ఉన్న పంచాయతీ కార్యదర్శిని నియమించాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఉపాధి నిధులు సుమారు రూ.12 కోట్లతో పల్లె పండుగలో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని, మరో రూ.17 కోట్లతో లింక్ రోడ్లు, పుంత రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదించినట్టు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి రాజకీయాలతో ముడిపెట్టకుండా సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు

బాలాజీచెరువు: జీవితంలో సాధించేందుకు ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని లయన్స్ క్లబ్ సభ్యుడు జీవీఎస్ గాంధీజీ అన్నారు. ఐక్యరాజ్య దినోత్సవం సందర్భంగా గురువారం అఖిల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు విద్య ప్రాధాన్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ మాట్లాడుతూ, మారుతున్న సాంకేతికతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. లయన్స్ డైమండ్ జూబ్లీ అధ్యక్షుడు ఎంవీఆర్ మోహన్‌కుమార్ మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్‌కు ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం ఉందన్నారు. క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు, విద్య ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు అవంత్స శత జయంత్యుత్సవం

బోట్‌క్లబ్: కేంద్ర సాహిత్య అకాడమీ, కాకినాడ క్రియ సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త అవంత్స సోమసుందర్ శత జయంత్యుత్సవం సందర్భంగా స్థానిక గాంధీభవన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు సదస్సు నిర్వహించనున్నట్లు క్రియ సెక్రటరీ జగన్నాథరావు గురువారం తెలిపారు. పిఠాపురానికి చెందిన సోమసుందర్ చేసిన రచనలు ప్రపంచ వ్యాప్తంగానూ పేరుగాంచాయన్నారు. ఈ సందర్భంగా జరిగే సాహితీ సమావేశాల్లో సాహిత్య అకాడమీ, తెలుగు సలహా సంఘ కన్వీనర్ సి. మృణాళిని, ప్రసిద్ధ తెలుగు విమర్శకులు చందు సుబ్బారావు, సాహితీ ప్రముఖులు కె.వెంకట్రావు, ఎర్రమిల్లి ఉషాకుమారి, సిదారెడ్డి, సీతారామస్వామి, ఈశ్వరరెడ్డి, బొల్లోజుబాబ, వాడ్రేవు వీరలక్ష్మి, కె.నాగమురళీశంకర్, నండూరి రాజగోపాల్ తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమాల్లో భాగంగా సోమసుందర్ కవిత్వం, ఆత్మకథ, మోనోగ్రాఫ్, అనువాదాలు వంటి అంశాలపై ప్రసంగాలు ఉంటాయన్నారు. సాహితీ విమర్శకులు, సాహితీ ప్రియులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

భూమిపూజకు ఎమ్మెల్యేల డుమ్మా..!

- ఎమ్మెల్యే వనమాడి గైర్హాజరుపై చర్చ
- ఎమ్మెల్సీ, కమిషనర్‌లే అతిథులు



భూమిపూజకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కమిషనర్ భావన తదితరులు

కాకినాడ: తడిచెత్త నుంచి బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసే వేస్ట్–2 ఎనర్జీ ప్లాంటు నిర్మాణ భూమిపూజకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వేంకటేశ్వరరావు(కొండబాబు) డుమ్మా కొట్టిన వ్యవహారం చర్చనీయాంశమైంది. కాకినాడ దుమ్ములపేటలో రూ.20 కోట్ల వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్లాంటు నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం భూమిపూజ చేయాలని తొలుత ప్రతిపాదించారు. ఎమ్మెల్యే వనమాడి సూచనతో ఆ సమాయాన్ని సాయంత్రానికి మార్పు చేశారు. అయితే, అతి ముఖ్యమైన ఈ ప్రాజెక్టు భూమిపూజకు అధికార పార్టీకి చెందిన టీడీపీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సాయంత్రం కూడా గైర్హాజరు కావడం.. ఆయన రాకపోవడంతో భూమిపూజ ప్రాంగణానికి వచ్చిన కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ వెనుతిరిగి వెళ్లిపోవడం చర్చకు దారి తీసింది. కొండబాబుతో పాటు, సిటీకి చెందిన టీడీపీ నాయకులంతా ఈ కార్యక్రమానికి పూర్తిగా దూరంగా ఉండటం వెనుక ఎమ్మెల్యే కొండబాబే కారణమంటున్నారు. ఇప్పటికే కమిషనర్ భావనతో ఎమ్మెల్యేకు పొసగడం లేదని, ఈ క్రమంలోనే ఆమె ఏర్పాటు చేసిన కార్యక్రమానికి దూరంగా ఉన్నారన్న వాదన అక్కడ వినిపించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన ఈ ప్రతిపాదనను స్వాగతించి, మరింత వేగంగా పనులు పూర్తిచేసేలా ప్రోత్సహించాల్సింది పోయి, స్వయంగా ఎమ్మెల్యే కొండబాబు గైర్హాజరు కావడం విమర్శలకు తావిచ్చింది. వనమాడి ఎందుకు రాలేదో అర్థం కాని పరిస్థితుల్లో రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కూడా నిరాసక్తత ప్రదర్శించారు. వేదికపైకి వెళ్లకుండా అనుచరులతో కలిసి వెనుదిరిగారు.

ఎమ్మెల్సీ, కమిషనర్ భూమిపూజ

ఎమ్మెల్యేలు ముఖం చాటేసిన నేపథ్యంలో.. ముందుగా అనుకున్న ప్రకారం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కమిషనర్ భావన యథావిధిగా కొనసాగించారు. రూ.20 కోట్ల వ్యయంతో రోజుకు 40 టన్నుల సామర్థ్యంతో ఈ బయో మెథనేషన్ ప్లాంటు ఏర్పాటు కాబోతోంది. చెత్త నుంచి సంపద సృష్టించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌కు చెందిన ఎనర్గాన్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కామేశ్వరరావు, ఈఈ మత్స్యారాజు, ఎంహెచ్ఓ పృథ్వీచరణ్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్ రెడ్డి, డి.అనంతశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై 'కూటమి' సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలపై కూటమి నేతలు స్థానిక జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతు ఇవ్వాలని నేతలు సూచించారు. ఇంకా పలు అంశాలపై చర్చించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, సూపర్‌బజార్ చైర్మన్, పెసింగి ఆదినారాయణ, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.